క్లుప్తంగా

మంత్రిని కలిసిన జిల్లా ఎస్పీ



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

బనగానపల్లె రూరల్ : నంద్యాల జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా రాష్ట్ర రోడ్లుభవరాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బనగానపల్లెలోని మంత్రి ఇంటికి ఎస్పీ చేరుకొని ఆయనకు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధి, పోలీసు సంక్షేమం , శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై మంత్రితో చర్చించారు.

21న గురు పౌర్ణమి వేడుకలు

డోన్ టౌన్: ఈనెల 21న శ్రీ పోలికి వరచితం బర స్వామి సన్నిధిలో గురు పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు గురువారం తెలిపారు. స్వామి వారి మహా సమాధికి పంచామృతాభిషేకం, పారాయణం తదితర ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నా హారతి ఉంటుందన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల: పాడి పశువులకు సోకే వ్యాధుల పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారిణి పద్మావతి సూచించారు. గురువారం రాష్ట్రీ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా కోటపాడు గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేసి ఎదకు రాని గేదేలకు ఇంజక్షన్‌లు వేసి మందులు పంపిణీ చేశారు. గేదేలకు వ్యాధులు సోకిన వెంటనే వైద్యం అందించాలని చెప్పారు.

రహదారికి మరమ్మతులు చేపట్టండి

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామం నుంచి పాపసాని కొట్టాల, తవిసి కొండ గ్రామం వరకు ఉన్న బీటీ రహదారి దెబ్బతింది. గతుకులమయంగా ఉన్న ఈ రహదారి గుండా ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కౌలు కార్డులపై అవగాహన



బి.తాడిపత్రిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల: రెవెన్యూ.వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల్లో కౌలు కార్డులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సునీతబాయి తెలిపారు. గురువారం బి.తాడిపత్రి, బి.ఉప్పలూరు గ్రామాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలానికి 250 కౌలు కార్డులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయని, పొలాలను కౌలుకు సాగు చేస్తున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతు సేవ కేంద్రాల్లో వీఆర్‌ఓ ద్వారా కార్డులు పొందాలన్నారు. కౌలు కార్డు కాల పరిమితి 11 నెలల మాత్రమే ఉంటుందన్నారు. ఏఈఓ నాగరాజు.వీహెచ్‌ఏలు స్నేహలత పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



ఆస్థానం రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్ : పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని ఆస్థానం రోడ్డు, పాతబస్టాండ్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తున్న ద్విచక్ర వాహనదారులు, తోపుడుబండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు.

కోవెలకుంట్లలో పిడుగుపాటు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం పిడుగు పడింది. ఉరుము, మెరుపులతో కూడిన వర్షం కురిస్తుండగా.. రైల్వేస్టేషన్‌కు దూరంగా ఖాళీ ప్రదేశంలో పిడుగు పడటంతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పిడుగుపాటు కారణంగా స్థానిక సీతారామనగర్‌లో పలువురి ఇళ్లలో హై ఓల్టేజీతో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి.

యాప్‌తో రైళ్లలో సమస్యలకు చెక్

- ప్రయాణికుల సౌకర్యార్థం రైల్ మదద్ యాప్
- 35 సమస్యలపై ఫిర్యాదుకు అవకాశం
- ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ
- సమస్యలకు సత్వర పరిష్కారం



నంద్యాల - ఎర్రగుంట్ల మార్గంలో నడుస్తున్న రైలు



రైలు మదద్‌యాప్

కోవెలకుంట్ల: ప్రయాణికుల పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు రైల్వే శాఖ వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే ప్రయాణికుల భద్రత నిమిత్తం వివిధ రకాల సేవలకు టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. రైలులో ప్రయాణించే వారికి ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఫిర్యాదు చేసేందుకు తాజాగా రైల్ మదద్ యాప్‌ను ప్రవేశ పెట్టింది. రైల్వేస్టేషన్లలో అపరిశుభ్రత, రైలులో భద్రత, సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి, ఇలా మొత్తం 35 రకాల సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైల్ మదద్ యాప్‌ను తీసుకొచ్చింది. రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫాం టిక్కెట్లు కలిగిన ప్రయాణికులు ఈ యాప్‌లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేసేలా అవకాశం కల్పించింది.

సమస్యలకు సత్వర పరిష్కారం..

రైల్వేస్టేషన్లలో అపరిశుభ్ర వాతావరణం, నీటి కొరత, వెయిటింగ్ హాళ్లలో సౌకర్యాలు లేకపోవడం , రైలు ప్రయాణానికి సంబంధించి రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండటం, టీటీఈ, ఇతర సిబ్బంది అవినీతి, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వస్తువల అపహరణ, దొంగతనాలు, ఘర్షణలు, ధూమపానం, మద్యం తాగడం, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన, ఆకతాయిల వేధింపుల పైనా ఫిర్యాదు చేయవచ్చు. రైల్వేస్టేషన్లలో మరుగుదొడ్లు, బోగీల్లో అపరిశుభ్రత, అధిక ధరలకు తినుబండారాలు అమ్మడం, ఏసీ, లైట్లు, ఫ్యాన్లు, చార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం, బెడ్‌రోల్స్ అపరిశుభ్రంగా ఉండటం, రైళ్ల రాకపోకపోకల్లో ఆలస్యం, తదితర సమస్యలపై ఈయాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

యాప్ డౌన్‌లోడ్, వివరాలు నమోదు ఇలా..

ప్రయాణికులు ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో సూచించిన వ్యక్తిగత వివరాలు, సెల్‌ఫోన్, ఈ మెయిల్‌ను నమోదు చేయాలి. సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. యాప్ ద్వారా ప్రయాణికుడు రైలు, స్టేషన్లలో వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. వివిధ సమస్యలకు సంబంధించి ఆధారాలు సమర్పించేందుకు తీసిన ఫొటోలను యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ప్రతి ఫిర్యాదుకు ఒక రెఫరెన్స్ నంబర్ ఉంటుంది. దీని ద్వారా ఫిర్యాదు స్టేటస్ తెలుసుకోవచ్చు. సమస్య పరిష్కారం కాగానే ఫిర్యాదుదారుడికి ఎస్ఎంఎస్, ఈ మెయిల్‌కు సమాచారం అందుతుంది.

నిరంతర పర్యవేక్షణ:

రైల్ మదద్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై రైల్వేశాఖ జనరల్, డివిజనల్ మేనేజర్లు నేరుగా పర్యవేక్షిస్తారు. ఫిర్యాదు చేసే స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ఓ ముఖ్య అధికారిని పంపి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేస్తారు. వారు సమస్యను పరిష్కరించి అందుకు సంబంధించిన వివరాలను ఫిర్యాదుదారుడి సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారం రూపంలో పంపిస్తారు. ఈ యాప్ రైల్వే ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరంగా మారటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ముగిసిన మొహర్రం



ఆకుమల్లలో పీర్లను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

సంజామల: మండలంలోని ఆకుమల్ల,ముదిగేడు,ఆల్వకొండ,కానాల,రెడ్డిపల్లె,రామిరెడ్డిపల్లె గ్రామా ల్లో గురువారం మొహర్రం పూజలు ముగిశాయి. సాయంత్రం పీర్లను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. అంతకు ముందు చావిళ్లలో పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల నిమజ్జన ఊరేగింపులో ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో వీధులు కిటకిటలాడాయి. యువకులు డప్పు వాయిద్యాలకు చిందులేశారు. నిమజ్జనం అనంతరం పీర్ల పెట్టెలను ఆయా చావిళ్లలో ఉంచారు.

ద్విచక్రవాహనం బోల్తా

- ముగ్గురికి తీవ్రగాయాలు

బేతంచెర్ల:మండల పరిధిలోని బుగ్గానిపల్లెతండా సమీపంలో గురువారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాలయ్యాయి. బుగ్గానిపల్లె తండాకు చెందిన సురేంద్ర నాయక్, నరేంద్రనాయక్, దుర్గాబాయి ద్విచక్రవాహనంపై బేతంచెర్ల నుంచి గ్రామానికి వెళ్తుండగా ఘటనా స్థలం వద్ద అదుపుతప్పి ద్విచక్రవాహనం బోల్తాపడింది. ప్రమాదంలో గాయడిన ముగ్గురినీ 108లో కర్నూలుకు తరలించారు.

మోస్తరు వర్షం



కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం



ఆకుమల్లలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురసింది. ఉదయం నుంచి ఉక్కపోత అధికంగా ఉండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రైతులు పత్తి, మినుము, కంది, పెసర, ఆముదం, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేశారు. పదిహేను రోజుల నుంచి వర్షం కోసం ఎదురు చూస్తున్న వాన పడటంతో ఊరట చెందుతున్నారు. సాగు చేసిన పంటలతోపాటు, సాగు చేయాల్సిన పంటలకు వర్షం అనుకూలంగా మారటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంజామల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వానాలు దాదాపు నెల నుంచి జాడలేవు. ఈ వర్షంతో మొక్కజొన్న,మినుము తదితర పంటలకు ప్రాణం పోసినట్లయ్యిందని రైతులు పేర్కొంటున్నారు.

ప్యాపిలిలో వర్షం

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రామకృష్ణాపురం, జలదుర్గం, బోంచెర్వుపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపార్లాయి. రామకృష్ణాపురం గ్రామంలో వంతెన వద్ద భారీగా వరద నీరు ప్రవహించడంతో గ్రామంలోకి కాసేపు రాకపోకలు స్తంభించాయి.

కిందపడి నలుగురికి గాయాలు

కొలిమిగుండ్ల: మండలంలోని గొర్విమానుపల్లెలో మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపు సమయంలో గురువారం ప్రమాదవశాత్తు కిందపడి నలుగురు యువకులు గాయపడ్డారు. పీర్ల ఊరేగింపును చూసేందుకు గ్రామానికి చెందిన యువకులు రాజు,హరీష్‌కుమార్,వంశీతో పాటు మరొకరు పీర్ల చావిడికి సమీపంలోని పురాతన కంబగిరిస్వామి ఆలయంపై ఎక్కి చూస్తుండగా అకస్మాత్తుగా రాళ్లు విరిగి పడటంతో కింద పడి గాయాలపాలయ్యాయ. వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తీసుకెళ్లారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామానికి చెందిన బంటుపల్లి అమృతకు పూర్వ విద్యార్థులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. పాయసం రమ్య, సరళ, ప్రభునాథ్ రెడ్డి తదితరులు రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచి, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన అమృత భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని సరోజమ్మ, గ్రామస్తులు పూల రంగారెడ్డి పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించిన వాహన చోదకులను సత్కరిస్తున్న దృశ్యం



కోవెలకుంట్లలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

హెల్మెట్ ధరించాలి

- జడ్జి తంగమణి

డోన్ టౌన్: సురక్షిత ప్రయాణం కోసం తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. గురువారం ఆమె ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ప్రయోజనాలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులను అభినందిస్తూ వారిని పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎంవీఐ నాగేంద్రరావు, బార్ కౌన్సిల్ అధ్యక్షులు వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ సూచించారు. గురువారం పట్టణంలో న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జమ్మలమడుగు చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ సర్కిల్, సంత మార్కెట్ మీదుగా గాంధీ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. న్యాయమూర్తి మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుని వారి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తిరుపాలు, సెక్రటరీ ఓబులేసు, జాయింట్ సెక్రటరీ శేఖర్, సీనియర్ న్యాయవాదులు మధుసూదన్‌రెడ్డి, బాలమురళీకృష్ణ, నరసింహ, ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, తిరుపతయ్య, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనలు.. తరచూ ప్రమాదాలు





బనగానపల్లె - అమరావతి హైవేపై టంగుటూరు క్రాస్ రోడ్డు సమీపంలో ఇరుకు వంతెనలు

- పట్టించుకోని హైవే అథారిటీ అధికారులు

బనగానపల్లె : బనగానపల్లె - అమరావతి నేషనల్ హైవేపై నియోజకవర్గ కేంద్రానికి రెండు కి.మీ. దూరంలో టంగుటూరు క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న ఇరుకు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాహనాల రద్దీ సమయంలో ట్రాఫిక్ స్తంభించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలా రోజుకు రెండు,మూడు సార్లు జరగడం సాధారణంగా మారింది. బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించే కాలంలో అప్పటి జనాభా ప్రాతిపదికన ఈ వంతెనలు నిర్మించారు. క్రమేణా వాహనాల రద్దీ పెరిగినప్పటికీ వంతెనలను విస్తరించలేదు. ఆరు సంవత్సరాల క్రితం హైవే అథారిటీ అధికారులు ఈ వంతెనలు వెడల్పు చేయడానికి తమిళనాడుకు చెందిన ప్రైవేట్ కాంట్రాక్టర్ ద్వారా నేల స్వభావంపై పరీక్షలు చేశారు. వంతెనలు వెడల్పు చేయుటకు ఇబ్బంది లేదని వారు నివేదిక సైతం ఇచ్చారు. అయితే ఇంతవరకు వాటిని విస్తరించకపోవడంతో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పెట్టుబడి సాయం ఇవ్వాలి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బేతంచెర్ల: ఎన్నికల హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేల చొప్పున ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం సచివాలయం ఉద్యోగులకు ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పంటల బీమా పరిహారంతో పాటు, కౌలు రైతు గుర్తింపు కార్డులు, రుణాలు, ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ జయరాం

డోన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ శానిటరీ అధికారులను కమిషనర్ డాక్టర్ జయరాం ఆదేశించారు. డీఈ రసూల్, ఏసీ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాలతో కలిసి గురువారం ఆయన స్థానిక 20వ వార్డులో పర్యటించారు. డ్రైన్లను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని అధికారులను ఆదేశించారు. నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి నుంచి సేకరించే తడి, పొడి చెత్తలను వేరు చేయడంలో అలసత్వం వహించినందుకు శానిటేషన్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిథిలమైన ఇళ్లను గుర్తించి అందులో నివసించే వారిని వెంటనే ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఇళ్లను కూల్చివేసేందుకు యజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు.

పుడమి తల్లికి పచ్చందాలు



జూన్ ప్రారంభం నుంచి నేటి వరకు తరచూ వర్షాలు పడుతుండటంతో పడమి తల్లి పచ్చందాలను సంతరించుకుంది. బేతంచెర్ల మండల పరిధిలోని తవిసికొండ, ముసలాయిచెర్వు పరిసర ఎర్ర మట్టి పొలాలు పచ్చని చెట్లతోకళకళలాడుతున్నాయి. ఈ దృశ్యాన్ని చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. – బేతంచెర్ల

యంబాయి నుంచి డోన్‌కు విద్యార్థి బస్సు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డోన్ డిపో మేనేజర్, గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామం నుంచి వెల్దుర్తి మీదుగా డోన్ వరకు విద్యార్థి బస్సును నడపనున్నట్లు డోన్ డిపోమేనేజర్ శశిభూషణ్ తెలిపారు. గురువారం ఆయన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యంబాయి, మండ్లవానిపల్లె, రుద్రవరం గ్రామాల విద్యార్థుల వినతి మేరకు బస్సు సర్వీసును ఏర్పాటు చేశామన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయండి

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఎంఈఓ సోమశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూల్‌లో బనగానపల్లె, బేతంచెర్ల, ప్యాపిలి, డోన్ మండలాల ఉపాధ్యాయులకు టీచ్ క్లాస్ రూమ్ అబ్జర్‌వర్స్ అంశంపై 9 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ సోమశేఖర్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌పీలు మధుశేఖర్, శివరామ్, మద్దిలేటి, రామాంజనేయులు, నాగమద్దయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

బనగానపల్లె రూరల్ : విద్యార్థులు ఇష్టంతో చదవాలని నందివర్గం పోలీసు స్టేషన్ ఎస్ఐ తిరుపాల్ సూచించారు. గురువారం మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ హెచ్ఎం గౌరిశంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అత్యాచారాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు సెల్‌ఫోన్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పాఠశాలతో పాటు బయట ఎవరి నుంచైనా ఇబ్బందులు ఉంటే వెంటనే కుటుంబ సభ్యులు, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి జియారత్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో మొహర్రం ముగిసిన మూడో రోజు ఏటా జియారత్ నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం పీర్ల నిమజ్జనం పూర్తవగా మూడవ రోజైన శుక్రవారం నుంచి గ్రామంలో దస్తగిరిస్వామి, మౌలాలి దర్గాల్లో జియారత్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులపాటు జరిగే జార్తల్లో భాగంగా ఉదయం మాబుసాని సమాధి, దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి పీర్లకు ఫతేహాలు సమర్పిస్తారు. భక్తులు పూలదట్టీలు, వెండిగొడుగులు, పూల దండలతో ఊరేగింపుగా తీసుకొని వచ్చి స్వామి వార్లకు అలంకరిస్తారు. మధ్యాహ్నం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కందూరు నిర్వహించనున్నారు. అదే రోజు అర్ధరాత్రి నుంచి పీర్ల ఊరేగింపు ప్రారంభమై శనివారం సాయంత్రం వరకు కొనసాగుతుంది. అనంతరం పీర్లను చావిళ్లలో కొలువుంచడంతో జార్తలు ముగుస్తాయి.

స్థానిక చరిత్ర..

పూర్వీకుల కథనం మేరకు కోడి కూత, రోకలిపోటు వినిపించని సమయంలో గ్రామానికి చెందిన మాబుసాని అనే భక్తుడు చేతిలో నిప్పులు పోసుకుని వెండిని కరిగించగా ఆచారి అనే మరో భక్తుడు దస్తగిరి స్వామి పీరును తయారు చేశారు. అనేక మహిమలు ఉన్న స్వామికి ఏటా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వామి మహిమలు తెలుసుకున్న ఒక దొంగల ముఠా పీరును దొంగలించి నొస్సం కొండల్లో వెండిని కరిగించేందుకు ప్రయత్నించగా ఆ దొంగల కళ్లు పోవడంతో పీరును అక్కడే వదిలేసి పారిపోరినట్లు స్థానిక చరిత్ర. నొస్సం కొండల్లో పీరు ఉందని వెంటనే వెళ్లి తీసుకొచ్చి దర్గాలో ప్రతిష్ఠించాలని దస్తగిరిస్వామి మాబుసానికి కలలో కనిపించి చెప్పగా భక్తులు అక్కడికి వెళ్లి పీరును తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి జియారత్ ప్రాధాన్యత సంతరించుకుంది. స్వామి మహిమలకు ఆకర్షితులైన అప్పటి భక్తులు పలగాటి ఉశేని, కొర్ర తిరుపాలు, తెలుగు లక్ష్మన్న, దూదెకుల బుడ్డన్న విరాళాలు సేకరించి దర్గా నిర్మించారు. అనంతరం కొంత కాలానికి మౌలాలి పీరును తయారు చేసి మాబుసాని వంశస్తుల ఆధ్వర్యంలో జార్తలు నిర్వహిస్తున్నారు.





ముస్తాబవుతున్న దస్తగిరి, మౌలాలి పీర్లు

పశువుల్లో గర్భకోశ వ్యాధులను నివారించండి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ రాజశేఖర్

- పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ రాజశేఖర్

డోన్: పశువుల్లో గర్భకోశ వ్యాధులను నివారించాలని పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ రాజశేఖర్ సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని ఆవులదొడ్డి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మల్లన్న, డాక్టర్ హుసేన్ బాషా, డాక్టర్ భాను తదితరులు హాజరై పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు, పశు పోషకులకు అవగాహన కల్పించారు. గొడ్డు, మోత పశువులు, ఎదకు రాని పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు నిర్వహించారు. అనంతరం డీడీ డాక్టర్ రాజశేఖర్.. పెయ్యదూడల కృత్రిమ గర్భధారణ, పోషణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డోన్ ప్రాంతీయ పశువైద్యశాల ఉపసంచాలకులు డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పశువులకు షెడ్లు, గొర్రెలకు, మేకలకు షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీతో అందజేస్తున్న పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెంపకందారులకు సూచించారు.